ప్రజాశక్తి
సోమవారం 22 సెప్టెంబర్ 2025 5
శ్రీ సత్యసాయి

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

అధికారులు తొలగించిన గోడను అనుమతులు లేకుండా కడుతున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

ఉమ్మడి జిల్లాలో అక్రమ లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా అక్రమ లేఅవుట్లు వేసిన రియల్టర్లు... ఇప్పుడు కూటమి నేతలతో అంటకాగుతూ అనుమతులు లేకుండా ఇళ్ల స్థలాల లేఅవుట్లు వేస్తున్నారు. అభూత ప్రకటనలతో ప్రజలను నమ్మించి, ప్లాట్లను విక్రయిస్తున్నారు. అహుడాతో పాటు పంచాయతీల పరిధిలో వందల సంఖ్యలో అక్రమ లేఅవుట్‌లు వేసిన రియల్టర్లు.. వీటిల్లో కొన్నింటికి మాత్రమే అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. అనుమతి లేకుండా వెంచర్లు వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వీరందరికీ అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి నిదర్శనం.. హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని సర్వే నెంబరు 374లోని సుమారు 2.40 ఎకరాల స్థలంలో అక్రమంగా లేఅవుట్ వేశారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారులు వెళ్లి లేఅవుట్ ప్రహరీని తొలగించారు. అయితే మళ్లీ వారు ప్రహరీ నిర్మాణానికి పూనుకోవడం గమనార్హం. దీన్నిబట్టి చూస్తే అధికార పార్టీ నేతల అండదండలు వారికి ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో జిల్లాలో అక్రమ లే అవుట్లు యథేచ్ఛగా వెలుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీ నేతల సిఫార్సులతో కొందరు ఇష్టారీతిన స్థలాల విక్రయాలు జరుపుతున్నారు. కొన్నిచోట్ల రాజకీయ నాయకులే అక్రమ లే అవుట్లను వేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వాదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది. గత నాలుగైదు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా జరుగుతోంది. మారుమూల ప్రాంతాల్లో సైతం లే అవుట్లు వెలుస్తున్నాయి. పచ్చని పంట పొలాలను మట్టితో కప్పుతూ ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. రహదారి వెంబడి భూములను మార్కెట్ ధరల కంటే అధికంగా కొనుగోలు చేస్తూ స్థలాలుగా విభజించి రెండు మూడురెట్లు అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. పట్టణాలకు సమీప గ్రామాల్లో పల్లె వాతావరణంతో పాటు, అన్ని రకాల వసతులు ఉండటంతో ఇళ్ల నిర్మించుకునేందుకు అక్కడ పలువురు స్థలాలను ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లు సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలున్నాయి. ఫలితంగా రియల్ వ్యాపారులకు కాసులు కురుస్తుండగా ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండి పడుతోంది. అనధికార లేఅవుట్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజక వర్గాల పరిధిలో అన్ని పంచాయతీల పరిధిలో పదుల సంఖ్యలో లేవుట్లు వెలుస్తున్నాయి. అయితే అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (అహుడా) ఆధ్వర్యంలో హెచ్చరికలు జారీ చేసినప్పటికీ సంబంధిత యజమానులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. స్థలాలు గానీ, ప్లాట్లు గాని కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమని ప్రకటిస్తున్నప్పటికీ యజమానులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేసి విక్రయించాలంటే ముందుగా అనేక రకాల అనుమతులు తీసుకోవాలి. అయితే జిల్లాలో కొన్నేళ్లుగా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారు. స్థానిక పంచాయతీ అధికారులకు ముడుపులు ముట్టజెప్పి స్థలాల అమ్మకాలు సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో అనేకచోట్ల ఇదే తంతు సాగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో వెలుస్తున్న అక్రమ లేఅవుట్లలో స్థలాల విక్రయాలు జరిగిపోతున్నాయి.

సడ్లపల్లి వద్ద వెలసిన అక్రమ లే అవుట్ గోడను జెసిబితో తొలగిస్తున్న అధికారులు (ఫైల్‌ఫోటో)

రియల్టర్లకు అధికార పార్టీ నేతల అండదండలు
పురపాలిక, పంచాయతీల ఆదాయానికి గండి

అంతే కాకుండా రాజకీయ నాయకుల సిఫార్సులతో ఆయా కాలనీల్లో స్థానిక అధికారులు అన్ని వసతులు కల్పిస్తున్నారు. తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోతోంది. వాస్తవానికి అనుమతులు లేని లేఅవుట్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేయడం వలన భవిష్యత్తులో ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉండదు.

అసలు లేవుట్లు ఎక్కడెక్కడ వేశారు

హిందూపురం రూరల్ మండలంలో కిరికెర పంచాయతీలో పదుల సంఖ్యలో అక్రమ లేవుట్లు వెలిశాయి. గతంలో ఒక సారి జిల్లా పంచాయతీ అధికారి తనిఖీ నిర్వహించి చర్యలు చేపట్టారు. వారు వెళ్ళిన అనంతరం అదే తంతు కొనసాగుతోంది. కె.బసవనపల్లి, కిరికెర, తూమకుంట పారిశ్రామికవాడ, బెంగళూరు రహదారితో పాటు పరిగి మండల పరిధిలోని మడకశిర జాతీయ రహదారిలో లే అవుట్లు వెలిశాయి. చిలమత్తూరు మండలంలో ఏకంగా జాతీయ రహదారి పక్కలోనే ఎల్పిన రాగమయూరి పరిశ్రమకు కేటాయించిన భూమిలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. మడకశిర మండలంలో సుమారు 15పైగా లేవుట్లు ఉంటే ఇందులో అక్షరాల రెండింటికి మాత్రం అనుమతులు ఉన్నాయి. హిందూపురం పురపాలక సంఘంలో 128 అక్రమ లే అవుట్లను అధికారులు గుర్తించారు. ఇదే పరిస్థితి అన్ని ప్రాంతాల్లో ఉంది.

ఇప్పటి దాకా ఏం జరిగింది

గత నాలుగు సంవత్సరాలుగా పెనుకొండ రెవిన్యూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీ, నగర పంచాయతీల పరిధిలోని వందల ఎకరాల్లో సాగు భూమిని ఇళ స్థలాల కోసం ప్లాట్లుగా వేసి విక్రయిస్తున్నారు. లే అవుట్ అప్రూవల్ కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వెళ్లడం లేదు. లాభాపేక్షతో తక్కువ విస్తీర్ణంలో అంతర్గత రోడ్లు వేయడంతో పాటు కనీస మౌళిక వసతులు కల్పించకుండానే ప్లాట్లు అమ్ముతున్నారు. కమ్యూనిటి అవసరాలకోసం స్థలం వదలాల్సి వస్తే వారికి అవసరం లేని ప్రాంతాలలో వదులుతున్నారు. కొనుగోలు దారులు అప్రూవల్‌ను అడగక పోవడంతో వ్యారస్తులు అనుమతులు తీసుకోవడం మానేశారు.

ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు లేకుండానే...

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా పలు మండలాల్లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందకుండానే భారీ లేఅవుట్లు వేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు. నిబంధల ప్రకారం తొలుత వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలి. 33 అడుగుల వెడల్పుతో బీటీ రోడ్లు, మురుగు నీటి పారుదలకు కాలువల నిర్మాణాలు చేపట్టాలి. లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలు వేసి, తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలి. లేఅవుట్‌లో పది శాతం భూమిని సామాజిక అవసరాలకు విడిచిపెట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్లకు ముందుగా పంచాయతీలో తీర్మానం చేసిన తరువాత సాంకేతిక పరిశీలన పూర్తయిన తరువాత అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అదే మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కూడా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాలి. కానీ రియల్టర్లు ఇవేమీ పట్టించుకోవడం లేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల అండతో పన్ను చెల్లించకుండానే వెంచర్లు వేస్తున్నారు. వేసిన ప్లాట్లు అమ్ముకుని సోమ్ము చేసుకొంటున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయాల ఆదాయానికి గండిపడుతోంది.

అక్రమ లే అవుట్లపై చర్యలు

అనధికార అక్రమ లే అవుట్లలో స్థలం లేదా ప్లాట్లు వేసినా చట్ట విరుద్ధం. వాటిపై చర్యలు తప్పవు. ఎలాంటి భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయం. అనధికారికంగా లే అవుట్లు వేసి అమ్మకాలు చేస్తే స్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

మల్లికార్జున,
హిందూపురం మున్సిపల్ కమిషనర్

పరిశ్రమల్లో పని గంటల పెంపును వ్యతిరేకించండి : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పరిశ్రమల్లో కార్మికుల పనిగంటల పెంపును వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, నాయకులు పెడపల్లి బాబా, నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఫ్యాక్టరీలు, షాపులు మరియు సంస్థల్లో పనిచేసే కార్మికుల పని గంటలు పెంపును ఈనెల 19న అసెంబ్లీలో ఎన్డీఏ సభ్యులు ఆమోదించారని అన్నారు. ఈ బిల్లును సోమవారం కౌన్సిల్లో ఆమోదానికి పెట్టే అవకాశం ఉందని అన్నారు. దీనిని వ్యతిరేకించాలన్నారు. వైసిపికి కార్మికుల మీద నిజంగా ప్రేమ ఉంటే కౌన్సిల్లో తమకు ఉన్న బలాన్ని ఉపయోగించుకుని బిల్లు వీగిపోయేలా చేయాలని డిమాండ్ చేశారు. కర్నాటక (2023), గుజరాత్ (2025)లో బీజేపీ ప్రభుత్వాలు కార్మికులు పని గంటలు పెంచడాన్ని రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుందని ఎద్దేవా చేశారు.కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఎన్డీఏ ప్రభుత్వ విధానాలపై పెద్ద ఎత్తున పోరాటం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఎస్ వెంకటేష్

15 మంది విద్యార్థులకు గవద బిల్లల వ్యాధి

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని కరికెర ప్రాథమిక పాఠశాలలో దాదాపు 15 మంది విద్యార్థులకు గవద బిల్లల వ్యాధి సోకి విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.ఆ పాఠశాలలో మొదట్లో ఓ విద్యార్థికి గవద బిల్లల వ్యాధి సోకడంతో ఆ విద్యార్థి నుంచి దాదాపు 15 మంది వరకు వ్యాధి సోకి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. మొదట్లో ఈ వ్యాధి సోకిన విద్యార్థిని ఇంటికి పంపించి ఉంటే ఇలాంటి సమస్య ఉండేది కాదని ఇది ఓరకంగా అంటువ్యాధి కావడంతో ఒకరి కొకరికి సోకి దాదాపు 15 మంది వరకు విద్యార్థులు ఈ వ్యాధితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత వైద్యాధికారులు స్పందించి ఆ పాఠశాలలో గవదబిల్లల వ్యాధిపై వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఈ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించి వ్యాధి సోకిన విద్యార్థులకు చికిత్స అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఉచిత మూర్ఛ వ్యాధి వైద్య శిబిరం

ప్రజాశక్తి- హిందూపురం

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో 131వ ఉచిత మూర్ఛవ్యాధిది వైద్య శిబిరాన్ని డాక్టర్ ఈటి రామ్మూర్తి నేతృత్వంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఇ టి రామ్మూర్తి మూర్ఛ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి రెండు నెలలకు సరిపడు మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో జెవివి నాయకులు రామకృష్ణ, మంజుళ, గంగిరెడ్డి, ఉగ్రప్ప, అంజన్ రెడ్డి, జి ఆర్ శ్రీనివాసులు, లక్ష్మీపతి, ఎం రామకృష్ణ, అతావుల్లా, మురళీమోహన్, అబ్దుల్ హాఖ్, కృష్ణమోహన్ రెడ్డి, సుబ్రమణ్య నాయక్, మంజునాథ చారి, విశ్వనాథ చారి, చంద్రశేఖర్ రెడ్డి, బాలగంగాధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

పార్టీ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

నియోజక వర్గ వ్యాప్తంగా పార్టీ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దామని వైసిపి నాయకులు వేణురెడ్డి అన్నారు. వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శులుగా చిలమత్తూరుకు చెందిన అన్సార్ ఆహ్మద్, హిందూపురం పట్టణానికి చెందిన అమానుల్లా, సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఫారూఖ్‌ను పార్టీ నియమించింది. ఈ నేపథ్యంలో నూతనంగా ఎంపికైన నాయకులు ఆదివారం వేణురెడ్డిని కలిసి తన ఎంపికకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పార్టీ అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గురుజాడ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతిగృహంలో తపన సాహిత్య వేదిక నిర్వహకులు, కవి, రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గురుజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తపన సాహిత్య వేదిక నిర్వాహకులు డా. అశ్వత్తనారాయణ, సిద్దగిరి శ్రీనివాస్, యన్. రాజశేఖరరెడ్డి, యువకవి గంగాధర్, హాస్టల్ వార్డన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని కందికుంట నారాయణమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం పట్టణ శాఖ కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఆదివారం ఆ కాలనీలో పర్యటించి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో 8 ఏళ్ల నుంచి సుమారు 700 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, 3 వేల జనాభా ఉన్నారన్నారు. అయితే నేటికీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు, తదితర మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు నడవడానికి వీలులేకుండా బురదమయం అవుతున్నాయన్నారు. వర్షాకాలంలో కాలనీల్లోని వీధుల్లో రాకపోకలు సాగించే క్రమంలో ఇప్పటికే పలువురు ప్రమాదాలకు గురయ్యారన్నారు. రోజూ వందలాది మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని, పందులు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యే స్పందించి కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, వైద్య శిబిరం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బత్తల సాంబశివ, నాగేశ్వర్, దివాకర్‌నాయక్, మోహన్, శ్రీనివాసులు, జహీర్, బాబ్‌జాన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో పిచ్చిమొక్కల మధ్య బురదమయంగా మారిన రోడ్డును చూపిస్తున్న నాయకులు

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెడితే కేసులు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు పంపుతామని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్ట్ పెట్టిన కదిరి పట్టణానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ వెల్లడించారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కదిరి పట్టణంలోని జోకుపాలెంకు చెందిన కొలేపల్లి అంజాద్‌ఖాన్(మెగా అంజాద్) ప్రజల మధ్య వైషమ్యాలను ప్రేరేపించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడన్నారు. 2021, 2024, 2025 సంవత్సరాల్లో రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, ఓ కిడ్నాప్ కేసు, ఓ ఛీటింగ్ కేసులో ఇప్పటికే అతడిపై కదిరి టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ సెక్షన్ల కింద 5 కేసులు నమోదు చేశారన్నారు. అంజాద్‌ఖాన్ తరచూ సోషల్ మీడియాలో అసభ్యకర రీతిలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతుండడంతో కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేశారన్నారు. సోషల్ మీడియాలో మహిళలు, బాలికల పట్ల అసభ్యకరమైన రీతిలో పోస్టులు పెట్టినా, కులాలు, రాజకీయ పార్టీలపరంగా రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఉన్న ఐదు సబ్ డివిజన్లలో సోషల్ మీడియా పోస్టులపై గట్టి నిఘా ఉంచామని, ఎప్పటికప్పుడు వాటిపై మానిటరింగ్ చేస్తున్నామన్నారు. జిల్లాలో కమ్యూనిటీపరంగా, పొలిటికల్ పరంగా ప్రతి ఏరియా సెన్సిటివ్ కాబట్టి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టేటప్పుడు ఆలోచించి పోస్ట్ చేయాలన్నారు. యువత సోషల్ మీడియాని మంచి కోసమే వినియోగించాలని ఎస్పీ సూచించారు.

ఎన్టీఆర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగమని ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. గతంలో ఈ పథకానికి డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ అని పేరు ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు అని పేరు పెట్టారు. గతంలో కంటే ఈ పథకంలో మరిన్ని విస్తృత సేవలను పొందుపరిచారు. సమాజంలో కాలానుగుణంగా ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పూర్వం పెద్దలు చిరుధాన్యాలు పండించి వాడటం, తద్వారా పౌష్టిక ఆహారం పొందడంతో రోగాలు దరిచేరేవి కావు. దీంతో పాటు వారు శారీరకంగా బలిష్టంగా ఉండేవారు. కానీ ప్రస్తుతం అలాంటి చిరుధాన్యాలు దొరకడమే గగనమైంది. ఉరుకులు పరుగులతో జీవితం యాంత్రికమైంది. ప్రతి వస్తువు కల్తీమయం కావడంతో రోగ నిరోధక శక్తి తగ్గిపోవడంతో కొత్త కొత్త రోగాలు కూడా వస్తున్నాయి. డబ్బులు ఉన్నవారు పెద్దపెద్ద కార్పొరేట్ ఆసుపత్రులలో తమ రోగాలను నయం చేసుకుంటున్నారు. అదే పేదలు, సామాన్యులు అయితే కార్పొరేట్ వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న వారి వైద్య ఖర్చులను భరించి భరోసా కల్పించడమే ఎన్టీఆర్ వైద్య సేవల ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలపై ఆ పథకం జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి ప్రజాశక్తి కి ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న: ఎన్టీఆర్ వైద్య సేవల కోసం బాధితులు ఎవరికి దరఖాస్తు చేసుకోవాలి? ఈ పథకానికి ఎవరు అర్హులు?

జవాబు : ఈ పథకం ద్వారా చికిత్సలు పొందడానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ హెల్త్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరు అర్హులే. ఇందుకోసం బాధితులు తమ హెల్త్ కార్డును తీసుకొని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలకు గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ కౌంటర్లలో సంప్రదించాలి. అక్కడ ఉన్న వైద్యమిత్రలతో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆ రోగి ఆయా ఆసుపత్రులలో ఉచిత చికిత్సలు పొందవచ్చు. గతంలో డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. ప్రభుత్వం జారీ చేసిన ఆధార్ కార్డులో రోగి పేరు ఉండాలి. అదే పేరు హెల్త్ కార్డులో కూడా నమోదై ఉండాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం, ప్రతి కుటుంబం రూ. 25 లక్షల వరకు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు.

ప్ర : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పథకంలో జరిగిన ముఖ్యమైన మార్పులు, కొత్త విధానాలు వివరించండి?

జ : కూటమి ప్రభుత్వం ఈ పథకంలో అనేక మార్పులు, విధానాలను అమలులోకి తెచ్చింది. ఈ ఏడాది 2025 ఏప్రిల్ 1 నుంచి కొత్త హైబ్రిడ్ విధానం తీసుకువచ్చింది. ఈ విధానంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యువజనతో కలిపి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలతో పాటు ప్రయివేటు బీమా సంస్థల భాగస్వామ్యంతో ఈ కొత్త హైబ్రిడ్ విధానం అమలులోకి తెచ్చారు. దారిద్ర రేఖకు దిగువ ఉన్న కుటుంబాల వారు ఈ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత చికిత్స పొందవచ్చు. రాష్ట్రంలో అర్హులైన వారిని ఇంటింటి సర్వే ద్వారా ఎఎన్ఎంలు సర్వే చేసి పీఎం జే ఏ వై హెల్త్ కార్డులను మొబైల్ యాప్ ద్వారా ఈ కేవైసీ చేసి కార్డులను ఇస్తున్నారు.

ప్ర : ప్రభుత్వం వైద్య సేవల సంఖ్యను మరింత పెంచి అందిస్తున్న సేవలు ఏమిటి?

జ: ఈ రూ.25 లక్షల పథకం కాక ఏ సామాజిక వర్గానికి చెందిన వారైనా ఆదాయంతో సంబంధం లేకుండా 70 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు ఏడాదికి రూ.5 లక్షల వరకు పిఎంజెఎవై హెల్త్ కార్డు ద్వారా దేశంలో ఏ ఆసుపత్రిలోనైనా వైద్యం పొందవచ్చు. రూ. 5 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తుంది. అలాగే రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలందరికీ స్మార్ట్ హెల్త్ కార్డులను అందించే ప్రక్రియను కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఇటీవలే సుమారు రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్య చికిత్సలు అందించడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోగి ఆసుపత్రిలో చేరిన 6 గంటల లోపే వైద్య అనుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. వైద్య సేవలు మొత్తం సంఖ్యను 3,257 వరకు పెంచారు. భవ్య హెల్త్ కేర్ సర్వీస్ సంస్థకు 108 సేవలను ప్రభుత్వం బదలాయించింది. అవసరమైన నూతన ఆంబులెన్సులను కొనుగోలు చేయడం జరిగింది.

ప్ర: జిల్లాలో కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు ఎంతమంది లబ్ధి పొందారు? వినియోగించిన మొత్తం ఎంత?

జ: జిల్లాలో ఇప్పటివరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల వల్ల 13,338 మంది లబ్ధి పొందారు. వీరి కోసం ప్రభుత్వం మొత్తం 20.06 కోట్ల రూపాయలు వినియోగించింది.

ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి

ప్ర: ఉచిత వైద్యసేవలు పొందడానికి ఏయే బిల్లులను సమర్పించాల్సి ఉంటుంది?

జ: ప్రభుత్వం విస్తృతంగా వైద్య సేవలను పెంచడం వల్ల ఏ ఆసుపత్రిలోనైనా చికిత్సలు పొందవచ్చు. అక్కడ ఉన్న వైద్య మిత్రలే అవసరమైన బిల్లులు ప్రభుత్వానికి అందజేస్తారు.

ప్ర: మీ శాఖకు జిల్లా కేంద్రంలో కార్యాలయం ఉందా? సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

జ: జిల్లా కేంద్రంలో మా కార్యాలయం లేదు. ప్రస్తుతం హిందూపురం నుంచే పర్యవేక్షిస్తున్నాము. అక్కడ మా కార్యాలయం కొత్త ఎంసిహెచ్ భవనంలో ఉంది. మా చిరునామా డాక్టర్ శ్రీదేవి, జిల్లా సమన్వయ అధికారి, సెల్ నెంబర్ 9281068500 కు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చు. మా శాఖలో ఇంకా జిల్లాలో 12 మంది వైద్య మిత్రలకొరత ఉంది. ప్రభుత్వానికి నివేదించాము. ఈ వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము.

రౌడీషీటర్లలో మార్పు రావాలి : ఎస్పీ

ప్రజాశక్తి యంత్రాంగం

మహిళలు, బాలికలపై అత్యాచారాలు, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, నేరస్తులు, రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు రావాలని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు సబ్ డివిజన్ల పరిధిలోని పోలీసు అధికారులు పాత నేరస్థులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రధానంగా మైనర్ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, హత్యలు, నేరాలకు పాల్పడితే అలాంటి వారిపై పోలీస్ శాఖ పరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నూతన ఎస్పీ దృష్టి సారించి వీటిని అరికట్టేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే అమ్మాయిలు వెంటపడి వేధించడం, వారికి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. అలాంటి వారి కదలికల పై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి షీట్స్ ఓపెన్ చేయడంతో పాటు కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఇక నుంచి నేరస్థులు, రౌడీ షీటర్ల ప్రవర్తనలో మార్పు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

రావాలని ఎస్పీ హెచ్చరిం చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ఇలాంటి నేరాలకు పాల్పడిన నేరస్థులతో పాటు రౌడీషీటర్లు 205 మందిని స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక నుంచి నేరాలకు స్వస్తి పలికి సత్ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు హెచ్చరించారు. పెనుకొండ స్టేషన్‌లో డీఎస్పీ నర్సింగప్ప సిఐ రాఘవన్, ఎస్ఐ భువనేశ్వరితో కలిసి సబ్‌డివిజన్ పరిధిలోని నేరస్థులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కదిరి స్టేషన్‌లో డీఎస్పీ శివ నారాయణస్వామి అప్‌గ్రేడ్ సిఐ నిరంజన్‌రెడ్డితో కలిసి సబ్-డివిజన్ పరిధిలోని 22 మంది పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హిందూపురం సబ్‌డివిజన్ పరిధిలోని 38 మంది పాతనేరస్థులు, రౌడీషీటర్లకు డీఎస్పీ మహేష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ధర్మవరం టూ టౌన్ స్టేషన్‌లో సిఐ రెడ్డప్ప పాత నేరస్థులను పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. ధర్మవరం రూరల్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు మండలంలో నేరాలకు పాల్పడే వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బత్తలపల్లి స్టేషన్‌లో ఎఎస్ఐ సోమశేఖర్‌మూర్తి రౌడీషీటర్లను హెచ్చరించారు. కొత్తచెరువు స్టేషన్‌లో సిఐ మారుతి శంకర్ రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని పిలిపించి పద్ధతులు మార్చుకోవాలని, లేనిచో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తనకల్లు స్టేషన్‌లో ఎస్ఐ గోపి నేరస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టపరమైన శిక్షల గురించి అవగాహన కల్పించారు. గాండ్లపెంట స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు రూరల్ సిఐ నాగేంద్ర, ఎస్ఐ రవికుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో సిఐ జనార్దన్, ఎస్ఐ షర్ఫుద్దీన్, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

24న 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఎపి వ్యవసాయ, కార్మిక, రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో వారు 'చలో విజయవాడ' కరపత్రాలను విడుదల చేశారు. జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషా మాట్లాడుతూ రైతులు 'సోలార్ కంపెనీ మాయలో పడకండి.. మీ భూములపై హక్కులను కోల్పోకండి' అని సూచించారు. రైతుల నుంచి సోలార్ కంపెనీ తీసుకున్న భూమికి ఎకరాకు ఏడాదికి కనీసం రూ. 50వేలు కౌలు ఇవ్వాలని, అగ్రిమెంట్ కాల పరిమితి పదేళ్లకు మించకుండా ఉండాలని, భూమి కొనుగోలు విషయంలో 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, కంపెనీ లాభాల్లో గ్రామాల అభివృద్ధి 10 శాతం ఖర్చు చేయాలని, లీజుకి తీసుకున్న భూములపై కంపెనీకి ఎలాంటి లోన్లు ఇవ్వకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధనకు విజయవాడలో రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, సిఐటియు నాయకులు ఎల్.ఆదినారాయణ, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ఈ నెల 24వ తేదీ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్‌కుమార్

చలో విజయవాడ కరపత్రాలు విడుదల చేస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్‌లోని సుందరయ్య కాలనీలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సెజ్‌ల పేరుతో రైతుల నుంచి బలవంతంగా లాక్కున్న భూములను తిరిగి రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టార్జితమైన భూములను అభివృద్ధి పేరుతో దోచుకోవడం దారుణం అన్నారు. రైతుల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సదాశివరెడ్డి, అశ్వర్థరెడ్డి, సమీవుల్లా, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు 'జాబిలి'కి సన్మానం

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జాబిలి చాంద్‌బాషాను ఆదివారం పట్టణంలోని ఎంక్యూ ఎ గ్లోబల్ ట్రస్ట్ కార్యాలయంలో జిల్లా రచయితల సంఘం, భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్వచ్ఛంధ సంస్థలు, కళాకారులు, కవులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, సామాజికవేత్తలు, రాజకీయ ప్రముఖులు, పట్టణ ప్రజలు విద్య, సామా జిక, సాహితీ రంగాల్లో జాబిలి చాంద్‌బాషా కృషిని కొనియాడారు. బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ మాట్లాడుతూ సమాజ నిర్మాతగా, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతూ నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న జాబిలి చాంద్‌బాషాకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం గొప్ప విషయం అన్నారు. సామాజిక పోరాట నాయకులు కోనాపురం ఈశ్వరయ్య మాట్లాడుతూ జాబిలి నాణ్యమైన విద్యనందిస్తూ, సమాజంలో మత సామరస్యాన్ని పెంపొందిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. దళిత హక్కుల పరిరక్షణ పోరాట సమితి అధ్యక్షులు హనుమంతు మాట్లా డుతూ జాబిలి సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూనే ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాణిస్తున్నార న్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి, సిద్ధి సమాధి యోగ గురువు రవిశంకర్ గురూజీ, టిడిపి పట్టణ

జాబిలి చాంద్‌బాషా దంపతులను సన్మానిస్తున్న కవులు, ప్రజాసంఘాల నాయకులు

కన్వీనర్ శ్రీరాములయాదవ్, ప్రగతి శ్రీనివాసులు, జాన్ ప్రియనాథ్, ధర్మవరం రోటరీ క్లబ్ నాయకులు నరేంద్రరెడ్డి, యుటిఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణస్వామి, ప్రజా సంఘాల నాయకులు, కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రికార్డులు తారుమారు చేసి భూమి కాజేశారు'

బాధిత కుటుంబ సభ్యుల ఆవేదన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తన తాతగారైన ఆర్మీ జవాన్ గూడా వెంకటేష్ భూమిని రికార్డులు తారుమారు చేసి ఆక్రమించా రని ఆర్మీ జవాన్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తచెరువు మండలానికి చెందిన గూడా వెంకటేష్‌కు 1982లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కప్పలబండ పొలంలోని సర్వే నెంబర్-266-1లో 5.25ఎకరాల వ్యవసాయ భూమిని మంజూరు చేసింది. గూడా వెంకటేష్ మరణానంతరం ఆయన కుమారుడైన గూడా శ్రీనివాసులు పేరిట రికార్డులు నమోదయ్యాయి. నాటి నుంచి నేటి వరకూ తామే సాగులో ఉన్నామని, ఏటా పంటలు సాగు చేస్తున్నామని బాధితుడు శ్రీనివాసులు తెలిపారు. అయితే రెండేళ్ల క్రితం కొత్తచెరువు గ్రామానికి చెందిన అనంత కిష్టప్ప అనే వ్యక్తి భూ రికార్డులను తారు మారుచేసి రికార్డుల్లో ఆయన పేరు నమోదు చేసుకున్నాడని తెలిపారు. అప్పటి నుంచి ఏ పంట సాగు చేసినా ధ్వంసం చేస్తూ దౌర్జన్యంగా భూమి లాక్కోవాలని ప్రయత్నిస్తున్నాడని వాపోయారు. ఇటీవల రూ. 3

భూమిలో బాధిత కుటుంబ సభ్యులు

లక్షలు వెచ్చించి పొలానికి కంచె వేయగా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. వీటికి సంబంధించి అన్ని ఆధారాలత రెండేళ్ల నుంచి రెవెన్యూ, పోలీసు అధికారులను ఆశ్రయించినా ఫలితం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని లేనిచలో మా కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని కన్నీరుపెట్టుకున్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఆదివారం కలెక్టరేట్ నుంచి ఓ ప్రకటన వెలువడింది. జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

అమడగూరు మండలం గాజులపల్లి గ్రామ సమీపంలోని శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమానికి ఆదివారం కదిరి పట్టణంలోని హరీష్ స్కూల్స్ అడ్వైజర్, మానస ధార సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎంఎస్.ప్రశాంత్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే వృద్ధాశ్రమంలో కంటి సమస్యతో బాధపడుతున్న వృద్ధుడు వెంకటరమణ కంటి చికిత్స కోసం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రశాంత్ మాట్లాడుతూ మా తల్లిదండ్రులు పద్మ, శ్రీనివాస్, సతీమణి సరిత జ్ఞాపకార్థం తమ వంతుగా వృద్ధాశ్రమానికి చేయూతనందించామన్నారు. ఇప్పటికే మానసధార సేవా సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. పేదల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం తనకెంతో సంతృప్తినిస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా వృద్ధుడు వెంకటరమణ కంటి చికిత్సకు దాదాపు రూ. 30 వేలు ఖర్చు అవుతుందని, అతడికి ఆధార్ కార్డు కూడా లేదని, దాతలు ఆర్థికసాయం చేయాలని ఆయన కోరారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన ప్రశాంత్

'మూర్ఛ'కు మందులు వాడాల్సిందే..

ప్రజాశక్తి-కదిరి టౌన్

మూర్ఛ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని విజయ వాడకు చెందిన ప్రముఖ నరాల సంబంధిత వైద్యులు డాక్టర్ గోపాలం శివనారాయణ తెలిపారు. మూర్ఛ వచ్చిన వారి చేతిలో తాళం చెవి పెట్టడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, అది కేవలం మూఢనమ్మకమేనని వివరించారు. జన విజ్ఞాన వేదిక కదిరి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎన్జీవో హోంలో మూర్ఛ వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన రోగులను పరీక్షించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎవరికైనా మూర్ఛ వ్యాధి ఉంటే వివాహం కాదనే అపోహతో ఈ రోగాన్ని దాచడం మంచిది కాదన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే మూర్ఛ తప్పక నయం అవుతుందన్నారు. మూర్ఛ రోగులు ఒంటరి ప్రయాణం చేయరాదని సూచించారు. ముఖ్యంగా మూర్ఛ వచ్చే మహిళలు వంట చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం 4 నెలలకు సరిపడా మాత్రలను నామమాత్రపు ధరకు అందజేశారు. కదిరి పరిసర ప్రాంతాల నుంచి 70 మంది మూర్ఛ రోగులు హాజరయ్యారు. తదుపరి వైద్య శిబిరం 2026 జనవరి 18వ తేదీ ఇదే ఎన్జీవో హోంలో నిర్వహిస్తామని జెవివి జిల్లా అధ్యక్షులు బి.నరసారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జెవివి విద్యా కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ మహేందర్‌రెడ్డి, రిటైర్ ఉపాధ్యాయులు నాగబసిరెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గోరంట్ల

రాష్ట్ర మంత్రి సవిత తండ్రి, మాజీ మంత్రి రామచంద్రారెడ్డి పేరిట ఈ నెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు నిమ్మల శ్రీధర్ తెలిపారు. పోటీల నిర్వహణకు ఆయన ఆదివారం టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నాయకులతో కలిసి గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని సూర్యదేవర స్కూల్ గ్రౌండ్‌ను పరిశీలించారు. టోర్నీలో పాల్గొనే జట్లు రూ. 1000 ప్రవేశ రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేత జట్టుకు రూ. 50వేలు, రన్నర్స్ జట్టుకు రూ. 30 వేల నగదు బహుమతి అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సిఐటియు నేతపై దాడి హేయం

సిపిఎం జిల్లా అధ్యక్షులు సి.రామకృష్ణ

ప్రజాశక్తి-తనకల్లు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్‌పై దాడి హేయమైన చర్య అని సిపిఎం జిల్లా అధ్యక్షులు సి.రామకృష్ణ పేర్కొన్నారున. తనకల్లులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుక్కపట్నం మండలంలో ఇటీవల ఓ మహిళా సంఘానికి సంబంధించిన లక్షలాది రూపాయలను కొందరు వ్యక్తులు సొంత అవసరాలకు వాడుకున్నారన్నారు. ఈ విషయం తెలియడంతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ ఆ సంఘం సభ్యులతో కలిసి వెలుగు కార్యాలయం వెళ్లి పై అధికారులను కలిసి విషయం తెలియచేయాలని ప్రయత్నిస్తుండగా వెలుగు సీసీ రవీంద్ర, బుక్ కీపర్ నాగరాజు నానా దుర్భాషలాడి అతడిపై దాడికి ప్రయత్నించడం తగదన్నారు. అక్రమాలపై ప్రశ్నిస్తున్న నాయకులపై దౌర్జన్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సీసీ రవీంద్రను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బుక్కపట్నం పోలీస్ స్టేషన్లో వారిపై ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, నాయకులు శివన్న, రమణ, వెంకటరమణ, వేమన్న, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ

25న గుంటూరులో యుటిఎఫ్ రణభేరి

రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై ఈ నెల 25వ తేదీ గుంటూరులో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం రణభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా యుటిఎఫ్ నిర్వహించిన రణభేరి కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేశారన్నారు. అయినా ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రానందున ఈ నెల 25వ తేదీ గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో యుటిఎఫ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు జిల్లా నుంచి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి వర్తింపచేయాలని, పిఆర్‌సి కమిటీ ఛైర్మన్ నియామకం ఆలస్యమైతే 29 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, బకాయి డిఎలు మంజూరు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్‌ను కొనసాగించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని, మున్సిపల్ జడ్పీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, విద్యా రంగ పరిరక్షణలో బోధనేతర కార్యక్రమాలు అన్నీ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మవరం జోన్

రణభేరి గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ నాయకులు ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, పి.సురేష్, హెచ్.రామాంజనేయులు, పుల్లయ్య, శంకర్, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ గుంటూరులో జరిగే రణభేరి భారీ ర్యాలీ, బహిరంగ సభ గోడపత్రికలను ఒడిసి, మిట్టపల్లి, కొండకమర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో మండల అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి బాలాజీ నాయక్, సీనియర్ నాయకులు సుధాకర్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకే రణభేరి నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు షరీఫ్, రియాజ్, శివనాయక్, అశోక్, తస్లీంబాను, రమేష్, మురళీనాయక్, షర్ఫుద్దీన్, భవానీ, మురళి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నరాత్రులు ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తచెరువు

విజయ దశమి పండుగ సందర్భంగా స్థానిక పెద్దమ్మ ఆలయం, కొత్తచెరువు అమ్మ ఆలయం, వాసవీమాత ఆలయాల్లో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయాల పూజారులు పెద్దన్న, ఆసన్న, తెలిపారు. ఒక్కో రోజు ఒక వేషధారణలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. తొలి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో పూజలు అందుకుని భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ విజయదశమి పండుగ రోజు అమ్మవారు రాజేశ్వరీ అలంకారంలో దర్శనమిస్తారన్నారు. ఈ 11 రోజులు ఆలయాల్లో అర్చకుల మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, భక్తజనం పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు.

నూతన ఎస్పీని కలిసిన 'పల్లె'

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.సతీష్ కుమార్‌ను ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా పల్లె ఎస్పీకి పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. పల్లె మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా ప్రశాంతతకు మారుపేరని, ఈ జిల్లాకు సతీష్‌కుమార్ ఎస్పీగా రావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు తగిన పాత్ర పోషించాలని, అందుకు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలను సత్యసాయి ట్రస్ట్ సభ్యులు, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహించేలా పోలీస్ యంత్రాగం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పల్లె వెంట టిడిపి నాయకులు మల్లిరెడ్డి, గంగాధర్, సలాంఖాన్, హరి, సోము, శివారెడ్డి, కార్యకర్తలు ఉన్నారు

ఎస్పీకి పూలబొకే ఇస్తున్న మాజీ మంత్రి పల్లె

కలెక్టర్‌కు 'కొత్తచెరువు సమగ్ర చరిత్ర' పుస్తకం అందజేత

కలెక్టర్‌కు 'కొత్తచెరువు సమగ్ర చరిత్ర' పుస్తకాన్ని అందజేస్తున్న హెచ్‌ఎం

ప్రజాశక్తి-కొత్తచెరువు

సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామ్‌ప్రసాద్‌ను ఆదివారం కలెక్టరేట్‌లో స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గోపాల్, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకన్న మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అలాగే వారు కలెక్టర్‌కు 'కొత్తచెరువు సమగ్ర చరిత్ర' పుస్తకాన్ని అందజేశారు. పాఠశాలలో డైమండ్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్ల గురించి కలెక్టర్‌కు వివరించి సహకరించాలని కోరారు. వారు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి కూడా ఉత్సవాల గురించి వివరించి నిర్వహణకు సహకరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ కార్యక్రమానికి అవసరమైన సదుపాయాలన్నీ కల్పిస్తామని తెలిపారు.

కొండకమర్లలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని కొండకమర్ల జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పుట్టపర్తి ఐ కేర్ డాక్టర్ రిజ్వాన్ పర్యవేక్షణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు పలువురికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారిని శస్త్రచికిత్స రెఫర్ చేశారు. కంటి సమస్యలతో బాధపడు తున్న సుమారు వంద మందికి మందులు, కళ్లద్దాలు ఉచితంగా అందజేశారు. శిబిరంలో జనసేన మండల కార్యదర్శి కొండబోయిన సతీష్, డాక్టర్ జాకీర్ అహ్మద్, ఆంజనేయులు, శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, జయారెడ్డి, గంగులప్ప, రమణ, సురేష్, ఇర్షాద్, హైదరవలి, నాగరాజు, విజయ్, వెంకటేష్, శ్రీరాములు. గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో సత్యసాయి బాబా చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న నిర్వాహకులు

గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

'గురజాడ'కు యుటిఎఫ్ నివాళి

ప్రజాశక్తి-రొళ్ల

మడకశిర పట్టణంలోని 4వ వార్డు ఎంపియుపి పాఠశాలలో ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో కవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి సభ నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఎన్.మాలింగప్ప, వై.జోగప్ప ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, గుడిబండ అధ్యక్షులు టి. మూడ్లగిరియప్ప మాట్లాడుతూ తెలుగు భాషను గ్రాంధిక భాష అనే సంకెళ్ల చెర నుంచి వ్యవహారిక భాషగా సామాన్యుని చెంతకు చేర్చిన యుగపురుషుడు గురజాడ అప్పారావు అన్నారు. కార్యక్రమంలో నాయకులు కదిరన్న, రవీంద్ర, ఎల్లప్ప, దేవరాజు, రామాంజి, నంజప్ప పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో ప్రవహిస్తున్న చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న జెసిబి, టిప్పర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎఎస్ఐ సోమశేఖర్ మూర్తి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు మండలంలోని ఓబుళాపురం గ్రామం వెళ్లే సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. అర్ధరాత్రి సమయంలో చిత్రావతి నది నుంచి అనంతపురం నగరానికి అక్రమంగా ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఒక టిప్పర్, 3 ట్రాక్టర్లు, అలాగే ఇసుకను తోడేందుకు ఉపయోగించిన జెసిబిని సీజ్ చేశామన్నారు. వాటిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని అరిగెల పోతన్న ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని ఆసుపత్రి అధినేత అరిగెల గణేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో డాక్టర్ లావణ్య 150 మందికి వివిధ వ్యాధులకు ఉచితంగా చికిత్స చేశారన్నారు. ప్రజలు ా ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని, వైద్య చికిత్స పొందితే పూర్తి ఆరోగ్యము లభిస్తుందని తెలిపారు. శిబిరంలో ఆవీస్ హాస్పిటల్ సిబ్బంది జియా, శ్రీనివాస్, అరిగెల పోతన్న హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ లావణ్య

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE COURT :MADAKASIRA
O.S NO:106/2022

Between:
D.Kadiri Kumar ...**Plaintiff**
AND
1) Indiwar(D11)
2)Kariyanna(D31)
3)Mandala Aparna(D81) ...**Defendant**

NOTICE TO DEFENDANTS NO 11, D31, D81

పై దావాను వాది మీ పైన మడకశిర జూనియర్ సివిల్ జడ్జి నందు సివిల్ దావా వేసినారు. పై దావా నందు మీరు అనగా 11వ ప్రతివాది Indiwar S/o D.Pandu RangaSwami, Teachers Colony Hindupur, 31Karyanna, S/o B.H. Hanumantharayppa R/o Ananthapuram. Madakasira (Mandal),81వ ప్రతివాది Mandala Aparna W/o C.K.Gopanna, Madakasira. కావున ప్రతివాదులుDefendants NO 11, D31, D81 అయిన మీరు 25-09-2025న మడకశిర జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు హాజరు అయిన మీరు కానీ, మీ తరపున లాయర్ హాజరు అయి వాదనలు వినపించుకొనవలెను.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
R.Nagendra,.B.A., L.L.B.,
Advocates, Madakasira,
Sri Sathya Sai Dist